క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుర్ల: పశ్చిమ గోదావరిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన వల్లాపురం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-19 బాలుర విభాగంలో చందక రవి, హరినాథ్, బాలికల విభాగంలో మహంతి భువనేశ్వరి రజత పతకాలు సాధించారని పీడీ మజ్జి తిరుపతిరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం అప్పారావు, యోగా శిక్షకుడు హరిబాబు అభినందించారు.

చిన్నారుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు



అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

బొండపల్లి: చిన్నారుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు అన్నారు. బాలల సంరక్షణ చట్టాలపై మండలంలోని బోడసింగిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు, అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయవాదులు పి.శ్రీనివాసరావు,ఆర్.సాయి శేఖర్, పి.ఆదినారాయణ, కె.శంకరరావు ,ఆర్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

చీపురుపల్లి: గరివిడి మండలంలోని కందిపేట గ్రామానికి చెందిన 10 కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. కంది త్రినాథరావు, కంది బాలకృష్ణ, కంది చక్రధర్, వేణు తదితరులకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. గరివిడి మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, వలిరెడ్డి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపిక మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు, ప్రాపర్టీ గది, సీడీ ఫైల్స్ ను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గుర్ల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, దుస్తులు అందజేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ చక్రవర్తి, సీఐ ఉపేంద్ర ఉన్నారు.

పాఠశాలలో తనిఖీలు



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 బాలభాస్కరరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, టీచర్ల లెసన్ ప్లాన్, విద్యార్థుల వర్కుబుక్‌లను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.

వరి పంటకోత ప్రయోగం

వేపాడ: మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల్లో ఏఎస్ఓ పైడిరాజు ఆధ్వర్యంలో మంగళవారం వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. బల్లంకిలో పల్లి దేముడమ్మ ,బానాదిలో చిప్పాడ సతీష్ పొలంలో పంటకోత ప్రయోగం చేయగా, ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని ఆయన తెలిపారు. డీవైఎస్ఓ డి.వేణు, కో-ఆబ్జర్వేటర్ కె.రమణ, ఏఈఓ అక్కునాయుడు, వీపీఏలు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

- ఈనెల 9నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం
- టీడీపీ అనుకూల పత్రికల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజక వర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండలాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా చెప్పని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అందుకే ప్రతీ గడపకు వెళ్లి ఓట్లు అడిగే హక్కు మనకే ఉందన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయిన టీడీపీకి ఓట్లు అడిగే హక్కు ఎక్కడుటుందని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్ల పరిపాలనలో సీఎం జగన్ ఆధ్వర్యంలో అవినీతి రహిత పరిపాలన అందించినట్లు చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో జరిగిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. అలాంటి విషయాలు పక్కన పెట్టి టీడీపీ అనుకూల పత్రికలు ప్రస్తుత ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితాలను ఒకటికి రెండు సార్లు పరిశీలన చేయాలని సూచించారు. అర్హత ఉన్న వారికి ఎవరికైనా ఓట్లు లేకపోతే తక్షణమే చేర్పించాలని, అలాగే ఓటర్ల జాబితాలో చాలా డబుల ఎంట్రీలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ఫారం-7లను ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు.

పల్లెనిద్ర చేయాలి

ఈనెల 9 నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ చెప్పారు. 9న మధ్యాహ్నం 3 గంటలకు అన్ని మండలాల్లో పార్టీ అధిష్టానం నిర్దేశించిన సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించాలన్నారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాలు ఆవిష్కరించి, అక్కడ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన బోర్డులను ప్రదర్శించి, ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం ఆ గ్రామంలోనే రాత్రి పల్లెనిద్ర చేయాలని స్పష్టం చేశారు. మండల స్థాయి నాయకులు అంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. డిసెంబర్ నెలాఖరులో నియోజకవర్గస్థాయిలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, గుర్ల, గరివిడి జెడ్పీటీసీలు శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతం, కొణిశ కృష్ణంనాయుడు, జమ్ము స్వామినాయుడు, తాడ్డి వేణు, నాలుగు మండలాల నాయకులు వలి రెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, పొన్నాడ కుమార్, కోట్ల వెంకట రావు, బూర్లె నరేష్, పి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బెల్లాన బంగారునాయుడు, పాట్నారు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాలుగు మండలాల నాయకులు

పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



గుర్ల: పల్లిగండ్రేడులో వృద్ధులకు మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకుడు సన్యాసినాయుడు



దత్తిరాజేరు: పెదమానాపురంలో వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు,జెడ్పీటీసీ రాజేశ్వరి

గుర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలపాలిట రక్ష అని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని పల్లిగండ్రేడులో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం పలు వురికి ఉచితంగా మందులు, వృద్ధులకు కళ్లద్దాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, వైద్యాధికారులు చెన్నయ్య, స్వప్న ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

దత్తిరాజేరు: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు,జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యనిపుణులను పల్లెలకు పంపించి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందిస్తోందన్నారు. అనంతరం రోగులకు మందులు, వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా నేత్ర శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.సర్పంచ్‌లు గొటివాడ దాసు, పాడుపురెడ్డి సత్యం, ఎంపీటీసీ కన్నయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

డిసెంబర్ 9న మెగాలోక్ అదాలత్

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో డిసెంబర్ 9వ తేదీన జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగాలోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు, పోలీసులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సివిల్, క్రిమినల్ తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకో వచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

వేపాడ: మండలంలోని బొద్దాం ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు పల్లి వెంకటరావు, శ్రీనివాసరావును తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను హెచ్ఎం, తోటి ఉపాధ్యాయులు కొనియాడారు.

ఘనంగా స్కౌట్స్ వ్యవస్థాపక దినోత్సవం

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని గైడ్ కెప్టెన్ ఏ.కనకలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సీహెచ్.ఈశ్వరరావు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన జెండాను ఎగురవేశారు. ముందుగా ఉద్యమ స్థాపకుడు బాడెన్ పావెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంఈఓ బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై డ్రోన్లు



డ్రోన్ పనితీరును తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి/గంట్యాడ: ప్రతి మండలానికి రైతులకు ఉపయోగపడే డ్రోన్‌ను 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేయనుందని కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. బోడసింగిపేటలోని ఏఎంసీలో మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వ్యవసాయ డ్రోన్‌లను పరిశీలించారు. డ్రోన్లతో అన్ని పంటలకు పురుగు మందులను సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చన్నారు. ఒక్కోడ్రోన్ పూర్తి ధర రూ.10 లక్షలుకాగా, 40 శాతం రాయితీపై రూ.6 లక్షలకు రైతులకు అందిస్తుందన్నారు. దీనిద్వారా ఎకరా విస్తీర్ణంలో పురుగుమందును కేవలం 10 నిమిషాల్లో పిచికారీ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, ఏడీఏ కె.మహరాజన్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని వివరిద్దాం

- 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' ప్రారంభం రేపే



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిన్నంనాయుడు



గంట్యాడ: మాట్లాడుతున్న జెడ్పీటీసీ నరసింహమూర్తి, జైహింద్‌కుమార్



దత్తిరాజేరు: మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాజేశ్వరి

బొండపల్లి: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని మండలంలో ఈనెల9వ తేదీన బొండపల్లి సచివాలయం నుంచి ప్రారంభించను న్నామని ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు తెలిపారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 9న మధ్యాహ్నం 3గంటలకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అంతా బొండపల్లి సచివాలయం వద్దకు చేరుకోవాలని కోరారు. గ్రామంలో ఎవరికి అభ్యంతరం లేని చోట పార్టీ జెండాను ఆవిష్కరించి, రాత్రి పల్లెనిద్ర చేయను న్నట్లు పేర్కొన్నారు. మరుసటిరోజు ఉదయం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, బి.రాజేరు సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, మండల నాయకులు తాళ్లపూడి కృష్ణ, పోతల కన్నంనాయుడు, గొల్లు సతీష్, తాళ్లపూడి అప్పలనాయుడు, రౌతు చిన్న, బండారు శ్రీనివాసరావు, సిరిపురం ఆదినారాయణ, వేమలి వెంకటరావు, సిరిపురం నాయుడుబాబు, పల్లి రామునాయుడు, తాడ్డి ప్రకాశ్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గంట్యాడ: ఈనెల 9వ తేదీ నుంచి మండలంలో నిర్వహించనున్న 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా విజయవంతం చేయాలని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' షెడ్యూల్‌ను వారు విడుదల చేశారు. 9న గంట్యాడలో, 10న కొర్లాం గ్రామంలో, 14న కొఠారుబిల్లి, 15న లక్కిడాం, 16న నరవ, 17న నీలావతి, 20న గొడియాడ, 21న కొండతామరపల్లి, 22న పెణసాం 23న రామవరంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనది పూటకో నాటకం

దత్తిరాజేరు: పూటకో నాటకం ఆడుతున్న టీడీపీ, జనసేన పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. పెదమానాపురంలో జెడ్పీటీసీ నివాసం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఈనెల 9వ తేదీన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం ప్రారంభించ నున్నట్లు చెప్పారు. తొలిరోజు దత్తి రాజేరులో ఈకార్యక్రమం ఉంటుందని చెప్పారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం జగన్ ప్రజలకు చేసిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయండి



చీపురుపల్లి: రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి



శృంగవరపుకోట: రాజకీయ పక్షాల నేతలతో సమావేశమైన ఈఆర్ఓ సుదర్శన్‌దొర

చీపురుపల్లి: 18 ఏళ్ల నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించడంలో రాజకీయ పార్టీలు ప్రధాన పాత్ర పోషించాలని స్థానిక ఆర్డీఓ బి.శాంతి సూచించారు. పట్టణం లోని ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమగ్రమైన ఓటర్ల జాబితాను రూపొందించడం తో పాటు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. జాబితాలో డబుల్ ఎంట్రీలు, మృతుల పేర్లు ఉంటే వాటిని తొలగించేం దుకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. బీఎల్ఓల వద్ద దరఖాస్తులు ఉంటాయని స్పష్టం చేశారు. తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

శృంగవరపుకోట: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి, 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని ఈఆర్ఓ సుదర్శన్‌దొర కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదు, చేర్పులు, తొలగింపులు, ఓటర్ల తుదిజాబితా ప్రచురణ తదితర అంశాలపై చర్చించేం దుకు రాజకీయపక్షాల నేతలతో మంగళవారం స మావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జయహో జగన్ పాదయాత్ర



తిరుమల పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను జామిలో నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

జామి/ లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ 2024లోనూ విజయం సాధించి, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో జయహో జగన్ పేరిట తాను చేపడుతున్న తిరుమల పాదయాత్రకు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు కోరారు. జామి మండల నాయకులతో జామిలో, ఎల్.కోట మండల నాయకులతో ఆ మండలంలోని గోల్డు స్టార్ జంక్షన్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బొడ్డవర గ్రామంలోని తన ఇంటి వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు చెప్పారు. 43రోజుల పాటు పాదయాత్ర చేసి డిసెంబర్ 21వ తేదీ నాటికి తిరుమల చేరుకుంటానని చెప్పారు. తనకు సంఘీభావంగా యాత్రలో పాల్గొనాలని నాయకులను కోరారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ పొంద్రంకి సంజీవి, జామి మేజర్‌పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ, నాయకులు ఫణిబాబు,ఎన్నింటి శేషు,అల్లు సత్యాజీ, శ్రీనురాజు,చుక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం పరిశీలన



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

జామి: మండలకేంద్రం జామిలో శ్మశాన వాటిక స్థలాన్ని ఆర్డీఓ సూర్యకళ మంగళవారం సందర్శించి పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో శ్మశాన వాటిక కోల్పోవడంతో వేరే స్థలాన్ని స్థానిక పెద్దల సహాయంతో తహసీల్దార్ హేమంత్‌కుమార్ గుర్తించారు. గుర్తించిన స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హైవేసిబ్బంది హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోలేదని జామి సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీఓ వచ్చి స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత హైవే సిబ్బందితో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే కాంట్రాక్టర్ పీఎస్‌కే సంస్థ మేనేజర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. దీంతో సంస్థ ప్రతినిధులు శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని చదును చేసి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో ఏటీఎం మోడల్‌లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని డీపీఎం హేమసుందర్, ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. సాధారణ విధానంలో కంటే ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. ప్రకృతివ్యవసాయ రీజినల్ అధికారులు కృష్ణారావు, ప్రకాశ్, హేమసుందర్, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, స్థానిక నాయకులు నౌడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సచివాలయంలో తనిఖీలు

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామ సచివాలయంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకొని వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ పంచాయతీ కార్యదర్శి సంధ్య ఉన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

సీసీ కాలువ పరిశీలన

వేపాడ: వావిలపాడు పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో చేపట్టిన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.ఆర్.వి.పైడిరాజు మంగళవారం పరిశీలించారు. పంచాయతీలోని యాదవపేటలో సీసీ కాలువ నిర్మాణంపై స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు పనులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కాలువల నిర్మాణ పనులకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని నివేదికగా జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈ దేవి, సర్పంచ్ బీల రాజేశ్వరి ఉన్నారు.



సీసీ కాలువను పరిశీలిస్తున్న డీఈఈ పైడిరాజు

ఓటు వజ్రాయుధం

శృంగవరపుకోట: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు ను వినియోగించుకోవాలని ఈఆర్ఓ సుదర్శన్ దొర, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ నారాయణమ్మ సూచించారు. స్థానిక ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఓటుహక్కు నమోదు, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. నోడల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్, బీఎల్ఓలు పాల్గొన్నారు.